సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 27 । జూన్ । 2024



విస్తారంగా వర్షాలు 8లో

జిల్లావ్యాప్తంగా బుధవారం కురిసిన వర్షానికి 165.4మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని అధికారవర్గాలు తెలిపాయి.



డ్రాపౌట్స్‌పై ప్రత్యేక దృష్టి

డ్రాపౌట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు ఆదేశించారు. 8లో



నేడు పలాస పాసింజర్ రద్దు

పూండి–నౌపడ మెయిన్ లైన్‌లో ఆధునికీకరణ పనుల వల్ల విశాఖ–పలాస పాసింజర్‌తో సహా పలు రైళ్లను రద్దు చేశారు. 8లో

ఇంటర్ సప్లిమెంటరీలో జిల్లా టాప్

- 67 శాతం ఉత్తీర్ణత

సాక్షి,పాడేరు: ఇంటర్ సప్లిమెంటరీ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. మొత్తం 2,655 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వీరిలో 1,766 మంది ఉత్తీర్ణులయ్యారు. 67శాతం నమోదైంది. ఒకేషనల్‌కు సంబంధించి 434 మంది పరీక్షలు రాయగా 255 మంది పాసయ్యారు. 59 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

టెన్త్‌లో తొమ్మిదో స్థానం..

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో జిల్లా తొమ్మిదో స్థానం సాధించింది. పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన 1015 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 794 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత శాతం 78.23 మేర లభించింది.

న్యూస్‌రీల్

కార్యకర్తలకు అండగా ఉంటా

- ఎటువంటి సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కొందాం
- జగనన్న ఆశయ సాధనకు కృషి చేద్దాం
- వైఎస్సార్‌సీపీ సమావేశంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: ఎటువంటి సమస్య వచ్చినా ధైర్యంగా నిలబడి, ఎదుర్కొందామని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించిన, నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని, మీరంతా ధైర్యంగా ఉండాలని కోరారు. వైఎస్సార్‌సీపీ పార్టీ బలోపేతానికి మరింత కృషిచేసి, జగనన్న ఆశయసాధనకు మరింత కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడ రాజబాబు, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బిత్తిరి రవిప్రసాద్ పాల్గొన్నారు.

నకిలీ కరెన్సీ చెలామణి


- ముంచంగిపుట్టులో గుర్తించిన వ్యాపారి



నకిలీ వంద నోటు

ముంచంగిపుట్టు: మండలంలో నకిలీ కరెన్సీ నోట్ల చలామణి చాపకింద నీరులా జరుగుతోంది. బుధవారం మండల కేంద్రంలోని వ్యాపారి సన్యాసిరావుకు రోజువారీ లావాదేవీల్లో భాగంగా వచ్చిన ఆదాయంలో నకిలీ రూ.వంద నోటును గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని మిగతా వ్యాపారులకు తెలియజేశారు. నకిలీ నోట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. దీనిపై ఎస్ఐ రవీంద్రను వివరణ కోరగా వ్యాపారులతో మాట్లాడి నకిలీ నోట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

'కనకమహాలక్ష్మి'కి ఇల్లు బహూకరణ



ఈవో శ్రీనివాసులరెడ్డితో గంటి కుటుంబ సభ్యులు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానానికి రూ.40 లక్షల విలువ చేసే తమ ఇంటిని గంటి కుటుంబ సభ్యులు విరాళంగా అందజేశారు. పాతనగరం పల్లావారి వీధికి చెందిన గంటి కామేశ్వరరావు, గంటి ప్రభాకర్, గంటి అరుణ్ కుమార్, గంటి శ్యామలా దేవికి సంయుక్తంగా 83.33 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న గ్రౌండ్, మొదటి అంతస్తు గల ఇల్లు (డోరు నంబరు 25–5–1) ఉంది. గంటి లక్ష్మీనరసమ్మ వారసులైన వీరంతా కనకమహాలక్ష్మి దేవస్థానం పేరిట జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి.. ఆ ఇంటి తాళాలను బుధవారం ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డికి అందజేశారు. రోజురోజుకూ ఆలయానికి భక్తుల రద్దీ పెరుగుతోంది. భక్తులకు మెరుగైన వసతులు కల్పించడంలో భాగంగా స్థల సేకరణ చేస్తున్న ప్రస్తుత తరుణంలో విలువైన గృహాన్ని దేవస్థానానికి గంటి కుటుంబ సభ్యులు అందజేయడం అభినందనీయమని ఈవో తెలిపారు. ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలిసొచ్చిన కదిరి లేపాక్షి

ఏజెన్సీలోని మెట్ట ప్రాంతాల్లో వేరుశనగలో కదిరి లేపాక్షి హైబ్రిడ్ రకం సిరులు పండిస్తోంది. సంప్రదాయ విత్తనాల కన్నా ఈ రకం సాగుపై దృష్టి సారిస్తున్నారు. నూనె శాతం ఎక్కువగా ఉన్నందున వ్యాపారులు కూడా గిరి రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పెట్టుబడి పోను ఎకరాకు రూ.12 వేలకు పైగా ఆదాయం పొందుతున్నారు.

- అనుకూలించిన ఏజెన్సీ వాతావరణం
- ఎకరాకు 15 బస్తాలకు పైగా దిగుబడి
- పెట్టుబడి పోను రూ.12 వేలకు పైగా నికర ఆదాయం
- గత ప్రభుత్వ హయాం నుంచి 90 శాతం రాయితీపై సరఫరా
- ఏటా లాభాలు పొందుతున్న రైతులు



వేరుశనగ తవ్వకాల్లో మహిళా కూలీలు





హుకుంపేట మండలం సంతారి ప్రాంతంలో కదిరి లేపాక్షి రకం వేరుశనగ పైరు (ఇన్‌సెట్) దిగుబడి

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో మెట్టప్రాంతం అధికంగా ఉన్నందున వాణిజ్య పంటల సాగుకు గిరిజనులు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. వీటితో ప్రధానంగా వేరుశనగను పండిస్తున్నారు. కొంతమంది రైతులు సంప్రదాయ విత్తనాలు వినియోగిస్తున్నారు. అయితే గత కొన్నేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం రాయితీపై కదిరి లేపాక్షి రకం విత్తనాలు సరఫరా చేస్తోంది. ఈ ప్రాంత వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున మంచి దిగుబడి వస్తోంది.

సేంద్రియ విధానంలో సాగు

ఎరువులు వినియోగించకుండా సేంద్రియ విధానంలో సాగు చేయడం వల్ల వేరుశనగ గింజలు నాణ్యతగా ఉంటున్నాయి. వీటిలో నూనె శాతం కూడా ఎక్కువగా ఉన్నందున గిరి రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు. పాడేరు డివిజన్‌లో మాత్రమే అధికశాతం గిరిజన రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. ఎకరాకు 40 కిలోల బరువు ఉండే 15 బస్తాలకు పైగా దిగుబడికి వస్తుంది. గిరిజనులు పంటను తవ్విన వెంటనే విక్రయిస్తున్నారు. వారపు సంతల్లో బస్తా రూ.1200 ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఎకరాకు పెట్టుబడి పోను రూ.12 వేల వరకు మిగులుతుందని రైతులు తెలిపారు.

1550 హెక్టార్లలో సాగు.. : వారపు సంతల్లో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది 90 శాతం రాయితీపై 700 క్వింటాళ్ల కదిరి లేపాక్షి వేరుశనగ విత్తనాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుగానే సరఫరా చేసింది. అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు, చింతపల్లి, పాడేరు, జి.మాడుగుల, అనంతగిరి, ముంచంగిపుట్టు, కొయ్యూరు, పెదబయలు మండలాల్లో 1696 హెక్టార్లలో వేరుశనగను పండిస్తున్నారు. ఈఏడాది ఇప్పటివరకు 1550 హెక్టార్లలో విత్తనాలు చల్లినట్టు వ్యవసాయశాఖ తెలిపింది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున మిగతా విస్తీర్ణంలో పంట వేసే అవకాశం ఉందని పేర్కొంది.

ప్రత్యేకతలివీ.. : కదిరి లేపాక్షి రకం విత్తనాన్ని 2020లో అనంతపురం జిల్లా కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం విడుదల చేసింది. పంట కాలం 112 రోజులు. ఆకుమచ్చ, వైరస్ తెగులు, రసం పీల్చే పచ్చదోమ, తామర వంటి చీడపీడలను తట్టుకుంటుంది. బెట్ట పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడినిస్తుందని వ్యవసాయశాఖ తెలిపింది.

జిప్సమ్‌తో నాణ్యమైన దిగుబడి



ఏజెన్సీ ప్రాంతంలో కదిరి లేపాక్షి రకం మంచి దిగుబడి ఇస్తోంది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. పంట నాణ్యతగా ఉండాలంటే పూత సమయంలో జిప్సమ్ వినియోగించుకోవాలి. దిగుబడి పెరగడంతోపాటు మంచి ఆదాయం వస్తుంది.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

కొండపడలో ఆధ్యాత్మిక సందడి

ఏనుగురాయి పంచాయతీ కొండపడలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఇక్కడ గిరిజనులు ఆరాధించే జగన్నాథస్వామి ఆలయంలో పూరీలో మాదిరిగానే 12 ఏళ్లకు ఓసారి విగ్రహాలను మార్పు చేస్తారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమం సందర్భంగా యాగం నిర్వహించనున్నారు.

- జగన్నాథుని ఆలయంలో 12 ఏళ్లకు ఓసారి విగ్రహాల మార్పు
- 30 నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు
- తరలిరానున్న హిందూ సంఘాల రాష్ట్ర, జిల్లా ముఖ్య నేతలు



జగన్నాథ సుభద్ర బలభద్రస్వామి విగ్రహాలు



గిరిజనులు నిర్మిస్తున్న యాగశాల



కొండపడలో జగన్నాథస్వామి ఆలయం

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కొండపడ గ్రామంలోని జగన్నాథస్వామి ఆలయంలో విగ్రహాల మార్పు కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ గ్రామంలో 12 ఏళ్లకు ఒక్కసారి విగ్రహాల మార్పు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమం ఈనెల 30 నుంచి వచ్చే రెండవ తేదీ వరకు మూడు రోజుల పాటు జరుగుతుంది. విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠకు ఆలయ సమీపంలో భారీగా యాగశాలను నిర్మిస్తున్నారు. ఒడిశాలోని పూరి నుంచి చెక్కతో ప్రత్యేకంగా తయారు చేసిన విగ్రహాలను తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆలయంలో ఉన్న విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి ఆలయం పక్కన నిర్జీవం చేస్తారు. వీటి స్థానంలో కొంత విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రాణ ప్రతిష్ఠ చేస్తామని గ్రామ గిరిజనులు తెలిపారు. మూడు రోజులపాటు అత్యంత వైభవంగా జరిగే ఈ కార్యక్రమం సందర్భంగా ప్రతిరోజు అన్నదానం నిర్వహిస్తారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం పూజలు చేస్తూ గిరిజన నృత్యాలు, భజనలు, కీర్తనలతో విగ్రహాల మార్పు కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి హిందూ సంఘాల రాష్ట్ర, జిల్లా ముఖ్య నేతలు పాల్గొనడమే కాకుండా, ఆంధ్రా ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారని గ్రామ గిరిజనులు తెలిపారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

8 నుంచి ప్రతి రోజూ వివేక్ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం: ప్రస్తుతం వారానికి ఐదు రోజులు నడుస్తున్న డిబ్రుఘడ్– కన్యాకుమారి– డిబ్రుఘడ్ వివేక్ ఎక్స్‌ప్రెస్ త్వరలో డైలీ ఎక్స్‌ప్రెస్‌గా రాకపోకలు సాగించనుందని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీజీఎం కె.సందీప్ తెలిపారు. జూలై 8 నుంచి డిబ్రుఘడ్–కన్యాకుమారి(22504) వివేక్ ఎక్స్‌ప్రెస్, జూలై 12 నుంచి కన్యాకుమారి–డిబ్రుఘడ్ (22503) వివేక్ ఎక్స్‌ప్రెస్ ప్రతి రోజూ నడుస్తుందని వెల్లడించారు.

'బొర్రా' జిప్‌లైన్ నిర్వాహకుడికి నోటీసులు

- నిలిచిపోయిన కార్యకలాపాలు
- గ్రామసభ ఆమోదం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ: సర్పంచ్ అప్పారావు



కార్యకలాపాలు నిలిచిపోయిన జిప్‌లైన్

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహల వద్ద పర్యాటకశాఖ, ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తున్న జిప్‌లైన్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. పీసా, గ్రామ సభ అనుమతులు లేకుండా తొమ్మిది నెలలుగా దీనిని నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో మంగళవారం బొర్రా పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ అప్పారావు అధ్యక్షతన వార్డు మెంబర్లు, పీసా కమిటీ నిర్వహించిన గ్రామ సభలో జిప్‌లైన్ నిర్వహణపై చర్చించారు. గ్రామ సభ ఆమోదం లేకుండా నిర్వహిస్తున్న జిప్‌లైన్ కార్యకలాపాలు నిలిపివేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ మేరకు జిప్‌లైన్ నిర్వాహకుడికి పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో జిప్‌లైన్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పారావు విలేకరులతో మాట్లాడుతూ.. ట్రయిల్‌రన్ ముసుగులో నేటికీ నిబంధనలకు విరుద్ధంగా జిప్‌లైన్ నడుస్తోందన్నారు. పీసా, పంచాయతీ అనుమతులు లేకపోవడంతో నోటీసులు జారీ చేశామన్నారు. సొసైటీ ద్వారా జిప్‌లైన్ నిర్వహించేలా గ్రామ సభలోని పీసా కమిటీ, వార్డు తీర్మానం చేశామన్నారు. బొర్రా జిప్‌లైన్ డెవలప్‌మెంట్ సొసైటీ కోయిటిగూడ పేరుతో జిప్‌లైన్ నిర్వహించేందుకు తీర్మానించామని తెలిపారు. జిప్‌లైన్ ద్వారా వచ్చే ఆదాయంలో పంచాయతీకి 20 శాతం, పర్యాటకశాఖకు 12 శాతం ఇచ్చేందుకు తీర్మానంలో పేర్కొన్నామన్నారు. ఎంపీటీసీ అరుణ, పీసా అధ్యక్షుడు దానియేలు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతంలో సేవలు ఎంతో అదృష్టం

- కలెక్టర్ విజయ సునీత
- ఘనంగా సత్కారం
- జేసీ భావన వశిష్ట అధ్యక్షతన వీడ్కోలు సభ



బదిలీపై వెళుతున్న కలెక్టర్ విజయసునీతను సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న జేసీ భావన వశిష్ట, డీఆర్వో పద్మావతి తదితర అధికారులు

సాక్షి,పాడేరు: స్వచ్ఛమైన గిరిజన ప్రాంతంలో అందమైన ప్రకృతి ఒడిలో సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నానని బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ఎం.విజయసునీత అన్నారు. బుధవారం ఆమెను కలెక్టరేట్‌లో అధికారులు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.జ్ఞాపికలను అందజేశారు. జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట అధ్యక్షతన జరిగిన వీడ్కోలు సభలో ఆమె జిల్లాలో గిరిజన ప్రాంతంలో సేవలు ఎంతో సంతృప్తి నిచ్చాయన్నారు. పక్కా ప్రణాళికతో అధికారులు, ప్రజల సహకారంతో సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామన్నారు. మోదకొండమ్మతల్లి ఆశీస్సులు ఉన్నాయన్నారు. సామాజిక పింఛన్ల పంపిణీతోపాటు వైద్యసేవల్లో అగ్రస్థానంలో జిల్లా నిలవడంతో ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. ఎస్పీ తుహిన్‌సిన్హా, జేసీ భావన వశిష్ట, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, పాడేరు, రంపచోడవరం సబ్‌కలెక్టర్లు ధాత్రిరెడ్డి, ప్రశాంత్‌కుమార్ తదితరులు మాట్లాడారు. విధి నిర్వహణలో ఆమె ఉత్తమ సేవలు అందించారన్నారు. సార్వత్రిక ఎన్నికలు, మోదకొండమ్మతల్లి జాతరను విజయవంతంగా నిర్వహించిన కలెక్టర్ సేవలు ఆదర్శనీయమన్నారు.ఈ కార్యక్రమంలో చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఏఎస్పీ ధీరజ్, డీఆర్వో పద్మావతి, ఎస్‌డీసీలు శర్మ,భవాని, గిరిజన సంక్షేమ ఈఈ రాజు, డీఆర్వో మురళీ, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు పాల్గొన్నారు.

పక్కాగా మధ్యాహ్న భోజన పథకం అమలు

డీఈవో బ్రహ్మాజీరావు



పెదవలస పాఠశాలలో ఉపాధ్యాయులను విచారిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

గూడెంకొత్తవీధి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు కోరారు. మండలంలోని పెదవలస ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ విద్యార్థులకు సక్రమంగా మధ్యాహ్నభోజనం అమలు చేయడం లేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం పెదవలస పాఠశాలను డీఈఓ తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో విడివిడిగా మాట్లాడి వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన చదువుతోపాటు మధ్యాహ్న భోజనం మెరుగుపరచాలని ఆయన ఆదేశించారు. ఎంఈవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి రహిత జిల్లాగా కృషి

- ఎస్పీ తుహిన్ సిన్హా
- డ్రగ్స్ బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు హితవు
- పాడేరులో ఘనంగా అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా



ర్యాలీలో పీవో సూరజ్ గనోరే, ఏఎస్పీ జగదీష్ అడహళ్లి, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



చింతపల్లిలో డ్రగ్స్ నివారణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్

పాడేరు : గంజాయి రహిత ప్రాంతంగా జిల్లాను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా పిలుపు నిచ్చారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం పాడేరులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నిషేధిత గంజాయికి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని సూచించారు. మంచి భవిష్యత్తు ఉన్న విద్యార్థులు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సాగు, రవాణా, సేవించడం చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి కేసులో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తమ లక్ష్యాలను సాధించేలా ప్రణాళికలను వేసుకొని ముందుకు సాగాలన్నారు. గ్రామాలకు వెళ్లినప్పుడు గంజాయి వల్ల కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించి వాటికి దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి సమాచారాన్ని పాడేరులోని జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్‌డీపీఎస్ సెల్‌కు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి నివారణకు పోలీస్ శాఖ ఇప్పటికే అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. గంజాయికు ప్రత్యామ్నాయంగా గిరిజన రైతులను వాణిజ్య, ఉద్యానవన పంటల సాగుపై ప్రోత్సహించామని చెప్పారు. గంజాయి నిర్మూలన కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఏఎస్పీ ధీరజ్, ఎస్ఈబీ జిల్లా సూపరింటెండెంట్, పాడేరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, పాడేరు సీఐ నవీన్‌కుమార్, వైద్య సిబ్బంది, పోలీస్, ఎస్ఈబీ సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రంపచోడవరం : ఏజెన్సీలో యువత గంజాయి వంటి మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే సూచించారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం రంపచోడవరంలో నిర్వహించిన కార్యక్రమంలో పీవో, ఏఎస్పీ జగదీష్ అడహళ్లి, సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో వారితోపాటు సీఐ వాసా వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్‌కుమార్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లి రూరల్: గంజాయి రవాణా,సాగుకు గిరిజనులు దూరంగా ఉండాలని స్థానిక ఏఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ సూచించారు. మండల కేంద్రంలో యాంటి డ్రగ్స్ డే కార్యక్రమంలో భాగంగా బుధవారం వారపు సంతలో డిగ్రీ కళాశాల,ఏపీఆర్ కళాశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు విద్యార్థులు బానిస కాకూడదన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే గంజాయి వర్తకుల మాటలు నమ్మరాదని, వారు తక్కువ మొత్తంలో డబ్బులు ఆశ చూపించి రూ.కోట్లు సంపాదించుకుంటున్నారన్నారు. వారి మాటల నమ్మి పోలీసు కేసుల్లో ఇరుక్కొని జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గంజాయి సాగు, రవాణా తదితర అసాంఘిక సమాచారం తెలిసే 9381123100 కు తెలియజేయాలని కోరారు. సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సీఐ రమేష్, ఎక్సైజ్ సీఐ రాజు, ఎస్ఐ వెంకటరమణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయభారతి పాల్గొన్నారు.

సేంద్రియ ధ్రువీకరణతో ఎంతో మేలు

జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ప్రదీప్ కుమార్



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

చింతపల్లి రూరల్: పంట ఉత్పత్తులకు సేంద్రియ ధ్రువీకరణ జత చేయడం వల్ల రైతులకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ప్రదీప్ కుమార్, జిల్లా రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి ఎమ్.విజయలక్ష్మి సూచించారు. మండలంలోని పెదబరడ గ్రామంలో రైతులు పండిస్తున్న వివిధ రకాల పంటల సమగ్ర యాజమాన్య పద్ధతులపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సేంద్రియ ధ్రువీకరణకు భూసార పరీక్షలు, విత్తన శుద్ధి, వరి, రాగి పంటల్లో కొత్త రకాలు, జీవ ఎరువుల వినియోగం, సేంద్రియ వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చొన్నారు. సాగు, ఎరువుల వినియోగంలో ఎటువంటి సందేహాలున్నా చింతపల్లిలోని వ్యవసాయశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఏడీఏ కంఠ జాహ్నవి, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్, అగ్రి ల్యాబ్ ఏవో పద్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కిచెన్ గార్డెన్లపై దృష్టి సారించాలి



అంతాడలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: మండలంలోని అంతాడ, కొత్త బంగారంపేట, కొత్తపల్లి, రాజుపేట గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో విజయకుమారి పరిశీలించారు. అంగన్‌వాడీ వర్కర్లు సేంద్రియ పద్ధతిలో కిచెన్ గార్డెన్‌లు పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆర్‌వో ప్లాంట్లను పరిశీలించారు. చిన్నారులను ప్రీప్రైమరీ పంపించాలని సూచించారు. సూపర్‌వైజర్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌పై ప్రత్యేక దృష్టి

- ట్రైబల్ వెల్ఫేర్ డీడీ కొండలరావు ఆదేశం

అరకులోయ టౌన్ : డ్రాపౌట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు ఆదేశించారు. రవ్వలగూడ పాఠశాలలోని అనంతగిరి, అరకువేలి, డుంబ్రిగుడ మండలాల హెచ్‌ఎంలు, సచివాలయం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సూచనలిచ్చారు. బడిబయట ఉన్న 5 నుంచి 14 ఏళ్ల వయసు గల పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏటీడబ్ల్యూవోలు వెంకటరమణ, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.50 కోట్లు

- 28 రోజులకు లెక్కింపు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గత 28 రోజులకు గాను రూ.2 కోట్ల 50 లక్షల 52 వేల 507 వచ్చినట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై యాత్రిక సదన్‌లో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 183.200 గ్రాముల బంగారం, 15,125 కిలోల వెండి లభించినట్టు పేర్కొన్నారు. లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

జోన్‌కు రెడ్ సిగ్నల్!

2019 ఫిబ్రవరి 27 విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వేజోన్ ఏర్పాటు చేస్తామంటూ కేంద్రం ప్రకటన

2019 మార్చి 08 సౌత్ కోస్ట్ రైల్వేజోన్ ఓఎస్‌డీగా ఎస్.ఎస్.శ్రీనివాస్ నియామకం. డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశాలు

2019 జూలై 01 శ్రీనివాస్ స్థానంలో ఓఎస్‌డీగా సీనియర్ అధికారి ధనుంజయులు నియామకం

2019 సెప్టెంబర్ మొదటి వారం జోన్ సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) రైల్వే బోర్డుకు అందజేత

2019 సెప్టెంబర్ 2వ వారం రైల్వే మంత్రిత్వ శాఖకు, కొత్త జోన్‌తో సంబంధం ఉన్న వివిధ జోన్‌లకు సలహాలు, సూచనల కోసం డీపీఆర్ ప్రతులను అందించిన రైల్వే బోర్డు.

2022 నవంబర్ 11న అప్పటి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మించే స్థలంతో పాటు భవనాల డిజైన్ల పరిశీలన

2022 నవంబర్ 12న దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభోత్సవం శంకుస్థాపన చేసేందుకు శిలాఫలకం కూడా సిద్ధమైపోయింది. కానీ రాత్రికి రాత్రే కార్యక్రమం నిలిచిపోయింది.

ఇక అప్పటి నుంచి ఏవో కుంటిసాకులు చెబుతూ రైల్వే జోన్ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ఇటీవల ఏర్పడిన కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) ప్రభుత్వానికి రైల్వే జోన్ డిమాండ్ చేసే అవకాశం ఉన్నా.. కేవలం మంత్రి పదవుల కోసం ఉత్తరాంధ్ర ప్రజల ఆశలను కేంద్రానికి తాకట్టు పెట్టింది.





- దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను అటకెక్కించిన కూటమి ప్రభుత్వం
- కేంద్రానికి ఇచ్చిన డిమాండ్లలో కనిపించని జోన్ అంశం
- జోన్ ఇప్పట్లో లేదంటూ రైల్వే ఉద్యోగులకు బోర్డు సంకేతాలు

సాక్షి, విశాఖపట్నం : ఏ ప్రాజెక్టుకైనా డీపీఆర్ అందించిన 30 నుంచి 60 రోజుల్లో పరిశీలన పూర్తి చేసి కార్యకలాపాలపై దృష్టిసారించాల్సి ఉంటుంది. కానీ.. దక్షిణ కోస్తా జోన్‌కు సంబంధించిన డీపీఆర్ అందించి ఏళ్లు గడిచినా పట్టించుకోలేదు. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు 2019లో కేంద్రం పచ్చజెండా ఊపడం .. కొత్త జోన్‌కి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) సిద్ధం చేసేందుకు ప్రత్యేకాధికారి(ఓఎస్‌డీ)ని నియమించడం.. జోన్‌కి సంబంధించిన డీపీఆర్‌ని రైల్వే బోర్డుకు సమర్పించడం అన్ని చకచకా జరిగిపోయాయి. 2020 లేదా 2021 జనవరిలో గానీ మార్చిలో గానీ రైల్వేజోన్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని అంతా ఊహించారు. కానీ.. జోన్ విశాఖకు ఇప్పట్లో అందించేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం అంగీకరించడంలేదు. దశాబ్దాల కల నెరవేరుస్తూ విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ప్రారంభించేందుకు తీసుకోవాల్సిన కీలక నిర్ణయంపై రైల్వే బోర్డు నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది.

వైఎస్సార్‌సీపీ పోరాటంతోనే..

జోన్ ఏర్పాటు కోసం దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నా.. రాష్ట్ర విభజన తర్వాత ఆ బాధ్యతను అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన భుజస్కందాలకు ఎత్తుకుంది. జోన్ ఏర్పాటు చేయాలంటూ నిరసన ప్రదర్శనలు, రైల్‌రోకోలు చేసి జోన్ ప్రకటన వచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చింది. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వాల్తేరు డివిజన్ కొనసాగించాలంటూ పోరాటం చేశారు. రాజ్యసభ సభ్యుడు వై.విజయసాయిరెడ్డి నేతృత్వంలో అప్పటి ఎంపీలు డా.బీశెట్టి సత్యవతి, ఎంవీవీ సత్యనారాయణతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన ఎంపీలు కూడా డివిజన్ కొనసాగింపుపై ఎప్పటికప్పుడు పార్లమెంట్‌లోనూ ప్రత్యక్షంగా ప్రధాని, రైల్వే మంత్రిని కలిసి వినతిపత్రాలు అందించారు. ఈ కారణంగానే వైఎస్సార్‌సీపీకి ఆ ఘనత దక్కకుండా కుయుక్తులు పన్నారు.

జోన్‌ను తాకట్టు పెట్టేసిన టీడీపీ, జనసేన

బీజేపీ భాగస్వామ్యంతో రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టీడీపీ, జనసేన పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వే జోన్ అంశాన్ని అటకెక్కించేశాయి. ఎన్‌డీఏ కూటమిలో ప్రస్తుతం టీడీపీనే కీలకం. ఈ సమయంలో రైల్వే జోన్ డిమాండ్‌ను టీడీపీ, జనసేన.. కేంద్రం ముందు పెడితే కచ్చితంగా జోన్ ఫైల్ ముందుకు కదిలేది. కానీ తమకు స్వప్రయోజనాలే ముఖ్యమని భావించి.. కేవలం మంత్రి పదవుల కోసం జోన్ అంశాన్ని ప్రస్తావన తీసుకురాక పోవడం ఉత్తరాంధ్ర వాసుల్ని విస్మయానికి గురి చేస్తోంది.

అదేవిధంగా ఇటీవల వాల్తేరు డివిజన్ ఉద్యోగులకు కూడా జోన్ ఇప్పట్లో రాదనే సంకేతాలు ఉన్నతాధికారుల నుంచి అందినట్లు తెలిసింది. జోన్ ఏర్పాటు చేస్తే వాల్తేరును రెండుగా విభజించి.. రాయగడ, విజయవాడ డివిజన్లలో విలీనం చేయాల్సి ఉంది. ఈ తరుణంలో ఉద్యోగుల విభజన కూడా జరగనుంది. కానీ.. ఇప్పట్లో.. విభజన ప్రక్రియ ఏమీ లేదనీ.. ఎవరూ ఎలాంటి దరఖాస్తులు చేసుకోవద్దని ఉన్నతాధికారులు స్పష్టమైన సంకేతాలిచ్చినట్లు సమాచారం. మొత్తంగా వైఎస్సార్‌సీపీ పోరాటాల్ని, విశాఖ యువత ఆశల్ని రాష్ట్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అడియాశలు చేసేసింది. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరికను రాజకీయాలకు బలిచేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భూముల పేరుతో దొంగాట

ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జోన్‌కు అవసరమైన భూములివ్వలేదంటూ ఆరోపించారు. భూములిచ్చిన తర్వాత అవి ముంపు భూములంటూ కొత్త పల్లవి అందుకున్నారు. రైల్వేకి ముడసర్లోవ ప్రాంతంలో అప్పగించిన స్థలం ముంపు ప్రాంతం కాదనీ, మిక్స్‌డ్ జోన్ అని జిల్లా యంత్రాంగంతో పాటు వాల్తేరు డివిజన్ అధికారులు కూడా స్పష్టం చేసినా జోన్ ఇవ్వడం ఇష్టం లేని ఎన్‌డీఏ ప్రభుత్వం తాత్సారం చేస్తోంది.

శిలాఫలకం దాచేశారు..!

ముందుగా జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి డీఆర్‌ఎం కార్యాలయం ఎదురుగా ఉన్న వైర్‌లెస్ కాలనీని ఎంపిక చేశారు. వైర్‌లెస్ కాలనీలో ఉన్న 13 ఎకరాల్లో 8 ఎకరాల విస్తీర్ణంలో హెడ్‌క్వార్టర్స్‌కు సంబంధించి డిజైన్లకు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆమోదముద్ర వేశారు. కాలనీని సైతం పరిశీలించారు. రూ.106 కోట్ల వ్యయంతో జోన్ ప్రధాన కార్యాలయానికి టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమయ్యారు. టెండర్లు ఖరారు చేసిన తర్వాత అగ్రిమెంట్ జరిపి.. 36 నెలల్లో భవనాన్ని పూర్తి చేయాలని రైల్వే అధికారులు భావించారు. 2022 నవంబర్ 12న ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారనీ.. శిలాఫలకం కూడా సిద్ధం చేశారు. కానీ 11వ తేదీ అర్ధరాత్రి 12 గంటల తర్వాత జోన్ శంకుస్థాపన కార్యక్రమాన్ని వాయిదా వేసేశారు.

సిద్ధం చేసిన శిలాఫలకాన్ని దాచేశారు. దీనంతటికీ కారణం స్థానిక బీజేపీ, టీడీపీ నేతలని ఆరోపణలు గతంలోనే వినిపించాయి. అప్పుడు శంకుస్థాపన చేస్తే క్రెడిట్ అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందనే రాజకీయ కుట్రతో ఉత్తరాంధ్ర వాసుల కలల్ని కల్లలు చేసేశారు.



మాయమైన 'జోన్' శిలాఫలకం

నేడు పలాస పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పూండి–నౌపడ మెయిన్ లైన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా.. ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను గురువారం రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. పలాస– విశాఖపట్నం(07471) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–పలాస(07470) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–గుణుపూర్(08522) పాసింజర్ స్పెషల్, గుణుపూర్–విశాఖపట్నం (08521) పాసింజర్ స్పెషల్‌ను రద్దు చేసినట్లు వెల్లడించారు.

రీ–షెడ్యూల్ చేసిన రైళ్లు ఇవే..

పెయిరింగ్ రైళ్లు ఆలస్యం కారణంగా పలు రైళ్లను రీషెడ్యూల్ చేశారు.

- కన్యాకుమారి–డిబ్రూఘర్ (225030 వివేక్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 4 గంటలు ఆలస్యంగా బుధవారం రాత్రి 9.15 గంటలకు బయలుదేరింది.
- సంత్రగచ్చి–సికింద్రాబాద్(07222) స్పెషల్ సుమారు 11 గంటలు ఆలస్యంగా బుధవారం రాత్రి 11 గంటలకు బయలుదేరింది.
- గురువారం ఉదయం 5.15 గంటలకు టాటానగర్‌లో బయలుదేరాల్సిన టాటానగర్–ఎర్నాకుళం (18189) ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా ఉదయం 7.15 గంటలకు బయలుదేరుతుంది.
- గురువారం ఉదయం 5.20 గంటలకు రాయ్‌పూర్‌లో బయలుదేరాల్సిన రాయ్‌పూర్–విశాఖపట్నం(08527) 2 గంటలు ఆలస్యంగా ఉదయం 7.20 గంటలకు బయలుదేరుతుంది.
- గురువారం మధ్యాహ్నం 12.10 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరాల్సిన భువనేశ్వర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(12830) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా సాయంత్రం 3.10 గంటలకు బయలుదేరుతుంది.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

గూడెంకొత్తవీధి: గంజాయిని ఆటోలో తరలిస్తుండగా ఇద్దరు వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేసినట్టు గూడెంకొత్తవీధి సీఐ అప్పలనాయుడు, ఎస్‌ఐ అప్పలసూరిలు బుధవారం తెలిపారు. వారు అందించిన వివరాల ప్రకారం మన్యం మీదుగా గంజాయి అక్రమ రవాణా జరగకుండా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు విస్తృతంగా వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఈ క్రమంలో మంగళవారం రింతాడ కూడలిలో తనిఖీలు చేస్తుండగా గతంలో గంజాయి కేసులో నిందితులుగా ఉన్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన మాయవతేవర, చింతపల్లి మండలం బురిసింగి గ్రామానికి చెందిన గాలి సత్యనారాయణలు 8,205 కిలోల గంజాయితో పట్టుబడ్డారన్నారు. దీని విలువ సుమారు రూ.4లక్షలు ఉంటుందన్నారు. వీరివద్ద నుంచి ఒక ఆటో, పల్సర్ ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లు, రూ.720 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ కేసులో మరొకరిని అరెస్టు చేయాల్సి ఉందని సీఐ అప్పలనాయుడు తెలిపారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో సీఐ అప్పలనాయుడు, ఎస్‌ఐ అప్పలసూరి

విస్తారంగా వర్షాలు



కొయ్యూరులో కురుస్తున్న వర్షం



డముకు వ్యూ పాయింట్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

- పొంగిన వాగులు, గెడ్డలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం



డుడుమ మార్గంలో రహదారిపై చేరిన వర్షపునీరు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి పాడేరుతో పాటు సమీప మండలాల్లో భారీ వర్షం కురిసింది. పాడేరు ఘాట్‌లో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. సుంకరమెట్ట రోడ్డులో పర్యాటకుల కారుపై చెట్టు విరిగిపడింది. కారులో ఉన్న పర్యాటకులకు ప్రమాదం త్రుటిలో తప్పింది.

165.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

జిల్లా వ్యాప్తంగా బుధవారం 165.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.అడ్డతీగలలో 50.4, అనంతగిరిలో 30.6, గంగవరంలో 22.,4, రాజవొమ్మంగిలో 14.6, వై.రామవరంలో 10.4, చింతపల్లిలో 8.2, పాడేరులో 7.2, డుంబ్రిగుడలో 4.2, అరకులోయలో 5.4, హుకుంపేటలో 5.8, గూడెం కొత్తవీధిలో 2.8, కొయ్యూరులో 3.2, రంపచోడవరంలో 0.2 ఎంఎం వర్షపాతం నమోదైందని కలెక్టరేట్ అధికారవర్గాలు తెలిపాయి.

ఇళ్లల్లోకి వరదనీరు..

ముంచంగిపుట్టు: మండలంలో బుధవారం సాయంత్రం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మండల కేంద్రంలో రోడ్లపై చేరిన వరదనీరు సంతబయలు ప్రాంతంలో ఇళ్లల్లోకి చేరింది. డ్రైనేజ్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అక్కడి ప్రజలు వాపోయారు. ఇలావుండగా ఏజెన్సీ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు భూసిపుట్టు, బుంగాపుట్టు, రంగబయలు, లక్ష్మీపురం ప్రాంతాల్లో వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రహదారులు బురదమయంగా మారడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షంతో పాటు ఈదురుగాలులకు మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

రాజవొమ్మంగి: మండలంలో బుధవారం రోజంతా కురిసిన చినుకులకు వాతావరణం చల్లబడింది. రైతులు నారుమళ్ల తయారీలో నిమగ్నమయ్యారు. వాతావరణం ఖరీఫ్ సాగుకు అనుకూలంగా ఉందని వారు పేర్కొన్నారు.

నష్టపోయిన గిరి రైతులు


అనంతగిరి: మండలంలోని డముకు, ములియగుడ, అనంతగిరి, తైడా ప్రాంతంలో బుధవారం రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఘాట్‌రోడ్డులో ఇరువైపులా కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించింది. రోడ్డుపైకి మట్టి, రాళ్లు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని కాశీపట్నం వారపు సంతకు ఆటంకం ఏర్పడింది. వ్యాపారులు వెనుదిరగడంతో పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేవారు లేక గిరి రైతులు నష్టపోయారు.

కొయ్యూరు: మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం కురుస్తోంది. కాలువలు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నారుమడులకు ఉపయోగకరమని రైతులు తెలిపారు.

కారు బోల్తా.. 'యలమంచిలి' ఎమ్మెల్యే తండ్రికి స్వల్పగాయాలు

అనకాపల్లి–ఆనందపురం హైవేపై ఘటన

సబ్బవరం: అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తండ్రి సత్యనారాయణకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా.. సుందరపు సత్యనారాయణ బుధవారం సాయంత్రం కారులో యలమంచిలి నుంచి జాతీయ రహదారి మీదుగా విశాఖపట్నం వెళ్తున్నారు. హైవే బైపాస్ రోడ్డులో ఇరువాడ సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణకు ముఖంపై స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే ఆయనను స్థానికులు విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై స్థానిక సీఐ పిన్నంటి రమణను సంప్రదించగా.. ప్రమాదం జరిగిందని, దీనిపై ఎటువంటి ఫిర్యాదు చేయలేదని తెలిపారు.



గాయపడిన యలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ తండ్రి సత్యనారాయణ